క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం, అమ్మవారికి ప్రీతియైన మంగళవారం కావడంతో భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మీనరిసింహా స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా కరుణాకర్



నియామక పత్రం అందజేస్తున్న రమేశ్‌కుమార్

కందుకూరు: నేషనల్ మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జిల్లా అధికార ప్రతినిధిగా మండల పరిధిలోని ధన్నారం గ్రామానికి చెందిన బందారి కరుణాకర్‌మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బీఎస్ రమేశ్‌కుమార్‌మాదిగ చేతుల నియామక పత్రాన్ని అందుకున్నారు. మంగళవారం కరుణాకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగల హక్కుల సాధన, ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాడుతామన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా మనోహర్



బాధ్యతలు స్వీకరిస్తున్న మనోహర్

కందుకూరు: కేశంపేట ఎంఈఓ మనోహర్‌కు కందుకూరు ఇన్‌చార్జిగా ఎంఈఓగా డీఈఓ అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా మంగళవారం ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓగా పని చేస్తున్న కృష్ణయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల శ్రేయస్సుతో పాటు పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కందుకూరు కాంప్లెక్స్ హెచ్ఎం మురళీమోహనాచారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లికార్జున్, సీఆర్పీలు వెంకటేశ్, షకీల్, ఐఈఆర్పీ సత్తయ్య, సిబ్బంది పాండు, సురేశ్‌కుమార్ పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.

తక్షణ సహాయక చర్యలు చేపట్టండి: ఎమ్మెల్యే

చైతన్యపురి: వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గడ్డి అన్నారం డివిజన్ వీవీనగర్‌లోని రహదారులు వరద నీటితో నిండి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ కాలనీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల వేసిన పైప్‌లైన్లలో చెత్త చేరి మూసుకుపోవడంతో సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్ నుంచి వచ్చిన వరదనీరు పొంగి రహదారులపై చేరిందన్నారు. పైప్‌లైన్లలో చెత్తను తొలగించేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భవాని ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు రమణారెడ్డి, విక్కి, శివరాం, నిఖిల్, వర్షిత్, సాయి, కల్యాణ్ పాల్గొన్నారు.

తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2023–24 సంవత్సరానికి గాను మండల పరిధిలో పండ్లతోటల పెంపకానికి ఈనెల 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి 5 ఎకరాలలోపు భూమి ఉండి జాబ్‌కార్డు, బోరుబావి, ఎలక్ట్రిసిటీ సదుపాయం గల ఎస్సీ, ఎస్టీ, చిన్న–సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తుపత్రం, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, ఉపాధి కార్డు, గ్రామ పంచాయతీ తీర్మానం తదితర జిరాక్స్ పత్రాలతో పాటు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో గ్రామ పంచాయతీ కార్యదర్శిని గాని, ఏఈఓ లేదా ఈజీఎస్ ఏపీఓను సంప్రదించాలని కోరారు.

ఆధార్ కేంద్రం మూత.. ప్రజల వెత

- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మూతపడిన ఆధార్ నమోదు కేంద్రం

కందుకూరు: ప్రస్తుతం ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా.. బ్యాంకులకు కేవైసీ చేయాలన్నా.. ఎక్కడ చూసినా ఆధార్ కార్డు వివరాలు తప్పనిసరి. ఇక్కడ మాత్రం మండల కేంద్రంతో పాటు ఏ గ్రామంలోనూ ప్రస్తుతం ఆధార్ నమోదు కేంద్రం పని చేయడం లేదు. మండల కేంద్రంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం కొద్ది నెలలుగా మూతపడటంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇతర మండలాల్లోని కేంద్రాల వద్దకు వెళ్లి పడిగాపులుకాస్తున్నారుర.

ఫిబ్రవరి 5 నుంచి బంద్

మండల పరిధిలోని అన్ని గ్రామాలకు కలిపి కేవలం కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రం ఉండేది. అదీ కూడా ఐదు నెలలుగా మూతపడింది. నకిలీ ఆధార్ నమోదుకు సంబంధించిన ఓ కేసులో అందులో పని చేసే ఓ వ్యక్తిని ఫిబ్రవరి 25న అరెస్టు చేయడంతో పాటు కంప్యూటర్, ఇతర పరికరాలను పోలీసులు సీజ్ చేశారు. దీంతో అప్పటి నుంచి ఆ కేంద్రం మూత పడింది.

పొరుగు మండలాలకు ప్రయాణం

ఆధార్ కార్డులో తప్పొప్పులు సరిచేసుకోవడానికి.. కొత్త ఆధార్ కార్డు తీసుకోవడానికి.. ఇంటి అడ్రసు మార్చుకోవడానికి, బ్యాంకులు, రైతు బంధు పథకాలకు కేవైసీ చేసుకోవడానికి ఇక్కడి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అందుబాటులో ఆధార్ నమోదు కేంద్రం లేక అటు యాచారం లేదా ఇబ్రహీంపట్నం మండలకేంద్రాలకు వెళ్లి పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **యువతకు ప్రాధాన్యం**
>
> ఆధార్ కేంద్రం సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి ఉన్నవారు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులను గుర్తించి కేటాయిస్తారు. కొత్తవారికి అవకాశం కల్పిస్తాం. యువత ముందుకు వస్తే ప్రోత్సహిస్తాం.
>
> – మహేందర్‌రెడ్డి, కందుకూరు

ఓటరు యంత్రాలపై బీఎల్ఓలకు శిక్షణ



బీఎల్ఓలకు అవగాహన కల్పిస్తున్న నాయబ్ తహసీల్దార్ తదితరులు

కందుకూరు: బీఎల్ఓలు ఎన్నికల కమిషన్ అప్పగించిన పనులను సక్రమంగా నిర్వర్తించాలని నాయబ్ తహసీల్దార్ తాజుద్దీన్ సూచించారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్‌తో కలిసి బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు యంత్రాల పని తీరు, వాటిని ఎలా వాడాలో శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి విచారణ చేయాలన్నారు. ప్రతీ బీఎల్ఓ తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓటర్ల జాబితా వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కందుకూరు: సీఎం కేసీఆర్, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

కందుకూరు: వీఆర్ఏలను ఇతర శాఖల్లో క్రమబద్ధీకరించినందుకు గాను వీఆర్ఏల జేఏసీ జిల్లా చైర్మన్ ఎడ్ల వెంకటేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. కావలికారులుగా పని చేస్తున్న వీఆర్ఏలకు రాష్ట్ర ప్రభుత్వం పేస్కేల్ ఇస్తూ జీఓ జారీ చేయడం శుభపరిణామమన్నారు. 23వేల కుటుంబాలను సంతోషంలో నింపిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు నరసింహ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాకి గణేశ్, సంఘం నాయకులు మనోహర్, గణేశ్, సుధాకర్, జంగయ్య, పి.మల్లేష్, శ్రీను, శంకర్, పి.శ్రీను, ప్రశాంత్, అజయ్, పి.రాములు, బజార్ నరసింహ, వి.నరసింహ, ఎ.శ్రీను, లక్ష్మమ్మ, పి.కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

పట్టించుకోని పాలకులు

కార్పొరేషన్ పరిధి ద్వారకామయినగర్ కాలనీలోని డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. పైగా రోడ్డు మధ్యలో మూతలు లేకుండా ఉన్న మ్యాన్‌హోళ్లతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉండడం, మ్యాన్‌హోళ్ల వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో రాత్రివేళ ఇటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మూతలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– మీర్‌పేట



ద్వారకామయినగర్ కాలనీలో మూతలేని మ్యాన్‌హోల్

పదిరోజుల్లో పరిష్కారం చూపాలి

- లేదంటే భిక్షాటన చేసి పనులు చేపడతాం
- ప్రభుత్వానికి కార్పొరేటర్ శ్రీవాణి హెచ్చరిక



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: విశ్వనగరం అన్ని గొప్పలు చెప్పుకునే తెలంగాణ ప్రభుత్వ పెద్దలు వర్షం పడగానే సెలవులు ప్రకటించడం విడ్డూరంగా ఉందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి విమర్శించారు. మంగళవారం ఆమె సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. వర్షానికి కాలనీల్లో మురుగు తిష్టవేసిందని, రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులలో వర్షం నీళ్లు నిలువకుండా ప్రజలు పడుతున్న సమస్యకు పరిష్కారం చూపకపోతే భిక్షాటన చేసి సమస్యను మేమే పరిష్కరించుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉందని ప్రజలకు చెప్పడం సరికాదన్నారు.

వర్గీకరణతోనే సమన్యాయం

- పార్లమెంట్‌లో బిల్లు పెట్టకపోతే బీజేపీకి రాజకీయ సమాధి
- ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్



మాట్లాడుతున్న తీగల ప్రదీప్‌గౌడ్

మహేశ్వరం: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వర్షకాల పార్లమెంట్ సమావేశంలో ఎస్సీల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే మాదిగలు బీజేపీకి రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పినందుకు ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 2న మహేశ్వరంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రావుగళ్ల బాబు మాదిగ, జిల్లా ఇన్‌చార్జి మద్దిలేటి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ మాదిగ, పాండు మాదిగ, రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో భాగస్వాములవ్వండి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఆమనగల్లు చైర్మన్ రాంపాల్‌నాయక్

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో మంగళవారం కౌన్సిలర్ లక్ష్మణ్‌తో కలిసి చైర్మన్ రాంపాల్‌నాయక్ హరితహారంలో భాగంగా ఇంటింటికి పూలమొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. హరితహారంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అందించే పూలమొక్కలను ఇంట్లో నాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బాధ్యతగా తీసుకోవాలి..

యాచారం: మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో మంగళవారం ఆమె మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి వ్యక్తి ఐదేసి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి..

తలకొండపల్లి: నాటిన ప్రతి మొక్కను బతికించుకోవాలని సర్పంచ్ కాడమోని శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో హరితహారంలో భాగంగా మంగళవారం ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి సర్పంచ్ శ్రీశైలం ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేశారు.

సరైన పిన్‌కోడ్‌తో సత్వరమే డెలివరీ

సరూర్‌నగర్ పోస్ట్‌మాస్టర్ నాయక్

హుడాకాంప్లెక్స్: పోస్ట్‌కార్డ్‌పై సరైన పిన్‌కోడ్ వ్రాస్తే నగరంలోని ఏ ప్రాంతం నుంచైనా 24 గంటల్లో ఉత్తరాలను (పార్సెల్స్) సంబంధిత చిరునామాకు చేరుతుందని సరూర్‌నగర్ పోస్ట్‌మాస్టర్ నాయక్ తెలిపారు. మంగళవారం సాక్షితో మాట్లాడుతూ సరూర్‌నగర్ సర్కిల్ పరిధి రామకృష్ణాపురం రోడ్డు నెం-6లోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో పోస్ట్‌ఆఫీసు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరూర్‌నగర్ పోస్ట్‌ఆఫీస్‌కు చెందిన పిన్‌కోడ్ వేయడంతో సకాలంలో ఉత్తరాలను అందించలేక పోతున్నామని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ఎల్ఐసీ బాండ్ పేపర్స్ వంటివి సకాలంలో చేరాలంటే సరైన పిన్‌కోడ్ తెలిసి ఉండాలని, ఆర్‌కేపురం పరిసర ప్రాంతవాసులు 500102 కోడ్‌ను వినియోగించుకుంటే సకాలంలో ఆయా ప్రాంత వాసులకు 24 గంటల్లో బట్వాడ చేస్తామని తెలిపారు. ఈ కొత్త పోస్ట్‌ఆఫీస్ పరిధిలోని కాలనీలు కొత్తపేట, వాసవికాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, ఎస్‌బీఐకాలనీ, సమతాపురి, న్యూనాగోల్, ఇన్కమ్‌ట్యాక్స్‌కాలనీ, కమర్షియల్‌ట్యాక్స్‌కాలనీ, రామలింగేశ్వర కాలనీ, న్యూమారుతీనగర్, శృంగేరికాలనీ, ద్వారకాపురం, అల్కాపురి, హరిపురికాలనీ, ఆర్‌కేపురం, టెలిఫోన్‌కాలనీ, స్నేహపురి, మోహన్‌నగర్, సౌభాగ్యనగర్, సత్యానగర్, నాగేశ్వరరావుకాలనీ, మార్గదర్శికాలనీ, ఇందిరానగర్, యాదవనగర్, కల్కినగర్, విజయపురి కాలనీ ప్రాంతవాసులు కొత్త పిన్‌కోడ్ 500102 తమ తమ అడ్రస్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి

ఆమనగల్లు: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుందారం తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, బ్రిలియంట్ విద్యాసంస్థల మాజీ ఉద్యోగి శేషన్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి పరామర్శించిన సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో మంగళవారం శేషన్‌నాయక్ భార్య పద్మావతి, కుమారులు దినేశ్‌కార్తీక్, చేతన్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మృతుడి భార్య పద్మావతికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా మృతుడి ఇద్దరు కుమారులను తమ విద్యా సంస్థల్లో ఉచితంగా చదివిస్తామని, భవిష్యత్‌లో చదువుకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోపీనాయక్, బిచ్చానాయక్, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

తుక్కుగూడ: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన కూడళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు, చెత్త నిల్వకుండా పారిశుద్ధ్య కార్మికులు వీధులు, రోడ్లను శుభ్రం చేస్తున్నారని వివరించారు. గృహ, వ్యాపార సముదాయాల నుంచి వచ్చిన చెత్తను వేరు చేసి తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన డిప్యూటీ కమిషనర్‌కు సన్మానం



డీసీ అరుణకుమారిని సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణకుమారిని మంగళవారం సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని ముంపు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు, ఇటీవల అనుమతులు పొందిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సిరీస్ కంపెనీ ప్రాంతంలో చేపట్టిన వాసవి కన్‌స్ట్రక్షన్స్‌తో సమీప కాలనీల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మురుగునీటితో మునిగిపోయే ప్రమాదం ఉందని డీసీకి వివరించారు. పరిసర కాలనీలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బాలకిషన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు నర్సింహగౌడ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరదముంపుపై చర్యలు తీసుకోండి

కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురవుతున్న కాలనీలు, డివిజన్లలో వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ సుమన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని సాయిహోమ్స్ కాలనీలో వరద నీరు ఇళ్లల్లోకి చేరుకుని బియ్యం, నిత్యావసర వస్తువులు, గృహ సామగ్రి తడిసి ముద్దయిందన్నారు. ప్రణాళిక లేకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి అవుట్‌లెట్ సంగతి మరిచిపోవడంతో రీసైక్లింగ్ మాదిరిగానే తిరిగి ఇళ్లల్లోకి మురుగు చేరుతోందన్నారు. అధికారులు అప్రమత్తమై ముంపు ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణను పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మంగపతినాయక్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తుంటి భాస్కర్ తదితరులున్నారు.

'మణిపూర్' దుండగులను శిక్షించాలి

సీపీఎం మండల కార్యదర్శి రవికుమార్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మహేశ్వరం: మణిపూర్‌లో హింసకు పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ హింసకు ప్రధాని మోదీ ఆ రాష్ట్ర బీజేపీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కారణమన్నారు. ఒక వైపు గిరిజన తెగల మీద దాడులు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం సిగ్గు చేటన్నారు. మణిపూర్ ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, కుమార్, మల్లేశ్, జగన్, చంద్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.